క్లుప్తంగా

వైఎస్‌ జగన్‌ను కలిసిన చింతపల్లి



వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితో చింతపల్లి హరిబాబు

టంగుటూరు: ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా సాగుతున్న హత్యలు, లైంగికదాడులు, హింసాకాండకు నిరసనగా వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు ఆ పార్టీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు తరలివెళ్లారు. మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

27 వరకు ప్రత్యేక ఆధార్‌ క్యాంపు

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్ల శ్రీరామపురం మండల పరిషత్‌ పాఠశాలలో ప్రత్యేక ఆధార్‌క్యాంపును ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయకుమారి తెలిపారు. ఈ నెల 27 వరకు క్యాంపు నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించాలి

పీసీపల్లి: పెండింగ్‌లో ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు రూ.2 లక్షల కోట్లు విడుదల చేయాలని, పనులు లేని ప్రాంతాల్లో నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్‌ చేశారు. బడుగు జనార్దన్‌, పి.మహేష్‌, వెంగయ్య, బాలయ్య నారాయణ, మార్కండేయులు ఉన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హనుమంతునిపాడు: సీజనల్‌ వ్యాధులు సోకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఓ క్రిష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్‌ సిబ్బంది, పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రమణ

హనుమంతునిపాడు: నెలాఖరు నాటికి మట్టి నమూనా సేకరణ పూర్తి చేయాలని వ్యవసాయాధికారి కె.రమణ అన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సాయంత్రం వీఏఏలకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 580 మంది రైతులకు మట్టి నమూనాలు సేకరించాల్సి ఉండగా 480 మందివి సేకరించారని, మిగిలిన 100 మంది నమూనాలు సేకరించాలన్నారు. ఏఈఓ గోపిక్రిష్ణా, వీఏఏలు ఆంద్రా కాశయ్య, ఖాదిర్‌, కొండలు, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.186



వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం చూర, ముక్క, పండుగుల్ల అత్యధిక ధర కేజీ రూ.186 పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం, ఎం. నిడమనూరు గ్రామాల రైతులు 566 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 522 కొనుగోలయ్యాయి. కనిష్ఠ ధర రూ.60, సరాసరి ధర రూ.140.56 పలికింది. వేలంలో మొత్తం 16 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధి కరువై.. బతుకు భారమై..!

- నెల రోజులుగా ఉపాధి పనులకు బ్రేక్‌
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు
- గ్రామాల్లో ఫీల్డ్‌ అసిస్టెంట్‌లను మార్చిన ఫలితంగా ఆగిన పనులు



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌)

కందుకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఉపాధి అవకాశాలకు పెద్ద దిక్కు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పిస్తుండడంతో వేలాది కూలీలు జీవనోపాధిని పొందుతున్నారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ పనులకు బ్రేక్‌ పడింది. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా నిజమైన ఉపాధి అవసరమున్న ఉపాధి అవసరం లేకుండా పోయింది. ఈ పథకంలో కింద గ్రామాల్లో పనులు చేయించే ఫీల్డ్‌ అసిస్టెంట్ల మార్పుతో ప్రస్తుతానికి గ్రామాల్లో ఈ పనులకు బ్రేక్‌లు పడ్డాయి. దాదాపు నెల రోజులుగా గ్రామాల్లో పనులు నిలిచిపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో కందుకూరు, వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాల్లో దాదాపు 92 పంచాయతీలు ఉన్నాయి. ఎన్నికల వరకు అన్ని పంచాయతీల్లోనూ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకం కింద కూలీలకు పనులు కల్పించారు. గ్రామాల్లో వేలాది మంది కూలీలు ఈ పథకంలో భాగం కింద పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఒక వారం మొత్తం పనికి వెళ్తే తక్కువలో తక్కువ కాకుండా దాదాపు రూ.1000 వరకు ఒకరికి కూలీ వస్తుంది. మంచిగా పనులు చేస్తే అంతకంటే ఎక్కువగా కూడా కూలీలు వస్తున్నాయి. అయితే ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పనులకు ఒక్కసారిగా బ్రేక్‌ పడింది. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకం కింద గ్రామాల్లో పనులు చేయించే ఫీల్డ్‌ అసిస్టెంట్లు, సీనియర్‌ మేట్‌లు వంటి వారిని తొలగించి కొత్తవారిని నియమించే ప్రక్రియను ప్రారంభించారు. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వ మద్దతుదారులు, నాయకులు, కార్యకర్తలకు ఈ పోస్టులను కట్టబెడుతున్నారు. దీంతో దాదాపు ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్లను తొలగించడం, కొత్తవారి నియామకం చేపట్టే ప్రక్రియతో గ్రామాల్లో పనులు ఆగిపోయాయి. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా ఒక నాలుగైదు పంచాయతీలు మినహా అన్ని పంచాయితీల్లో పనులు నిలిచిపోయాయి. దీంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకం కింద ఉపాధి పొందుతున్న వేలాది మంది కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల నుంచి పనులు లేకపోవడంతో కుటుంబం గడవడం ఇబ్బందికరంగా బడుగు, బలహీన వర్గ కూలీలు వాపోతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో వ్యవసాయ సీజన్‌ కూడా పూర్తి స్థాయిలో ప్రారంభం కాకపోవడంతో అటు వ్యవసాయ పనులు కూడా దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణం స్పందించి ఉపాధి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్‌ చేస్తున్నారు. అలాగే కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు కూడా కొంత మేరకు పెండింగ్‌ ఉన్నాయని ఆ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

పేదలు ఇబ్బందులు పడుతున్నారు



ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతిరోజూ జరిగే ఉపాధి పనులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు పెట్టి రెండు నెలలు దాటిపోయింది. దాని గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పేదలు కూలి డబ్బులు లేక కుటుంబం గడవక చాలా బాధలు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఫీల్డ్‌ అసిస్టెంట్లు, మేట్లను మార్చాలని తిరుగుతున్నారు కానీ పనులు పెట్టాలని ఎవరూ పట్టించుకోవడం లేదు.

– చింతం జనార్దనరెడ్డి

పండ్ల తోటల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ వాక్యవతి



పామూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ, హెచ్‌ఓ

పామూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలకు అమలయ్యే పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డి, ఉద్యానవనశాఖాధికారి కె.కుసుమ సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం ఏపీఓ బి.మాల్యాద్రి అధ్యక్షతన పండ్ల తోటలు సాగుచేసే రైతులకు, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని సన్న, చిన్న కారు రైతులు లబ్ధి పొందాలన్నారు. ఈ పథకం కింద 17 రకాల పండ్ల తోటల పెంపకానికి మొక్కలు అందించి ఉపాధి కూలీలతో పనులు చేయించనున్నట్లు తెలిపారు. మామిడి, స్వీట్‌ ఆరెంజ్‌, నిమ్మ, జామ, తైవాన్‌జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, అంజీరా, పనుపు, ఆపిల్‌బేర్‌, డ్రాగన్‌ ఫ్రూట్‌, రోజాపూలు, మల్లెలు, మునగ, నేరేడు తోటల సాగుకు నిధులు ఈ పథకం కింద వరుసగా మూడేళ్ల పాటు ఇస్తామన్నారు.

సీఎస్‌పురం(పామూరు): పండ్లతోట సాగుకు రైతులు ప్రభుత్వ పథకాలు, సాయాన్ని వినియోగించుకోవాని ఏపీఓ వాక్యవతి అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగు, ప్రభుత్వం నుంచి అందే సాయంపై మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయ సమావేశ హాలులో పండ్లతోటలు సాగుచేసే రైతులకు, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఓ కె.కుసుమ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం కబ్జాకు యత్నం



స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

గుడ్లూరు(కందుకూరు): విలువైన పంచాయితీ స్థలం కబ్జాకు యత్నించిన సంఘటన మంగళవారం గుడ్లూరులో చోటు చేసుకుంది. రెడ్డిపాలెంబజార్‌ పాత రైస్‌మిల్లు ఎదరు పంచాయతీ స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉంది. అయితే ఆ స్థలానికి సమీపంలోను ఉంటున్న శంకరయ్య అనే వ్యక్తి ఆ స్థలంను కబ్జా చేసేందుకు గత కొంత కాలంగా ప్రయత్నం చేస్తున్నాడు. మంగళవారం కొందరు కూలీలను తీసుకొచ్చి స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికులు అక్కడికి చేరుకుని అది పంచాయతీ స్థలం కదా, ప్రజా అవసరాల కోసం దాన్ని వినియోగించాలనే అలోచన ఉందనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానికులకు, శంకరయ్యకు మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. అనంతరం స్థానికులు పంయయితీ అధికారులు స్థలం కబ్జా విషయం ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థనానికి చేరుకున్న పంచాయితీ సెక్రటరీ మహేష్‌, సర్పంచ్‌ శంకర్‌ స్థలం కబ్జా యత్నాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో కంచె వేయడం నిబంధనలకు విరుద్ధమని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కౌలు కార్డులతో ఎన్నో ఉపయోగాలు



కొండపిలో మాట్లాడుతున్న తహసీల్దార్‌ కిరణ్‌కుమార్‌, పక్కన ఏఓ విజయ్‌కుమార్‌



హెచ్‌ఎంపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్‌



గుడిపాటిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

హనుమంతునిపాడు: సాగు ధ్రువీకరణ కార్డులు కౌలు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తహసీల్దార్‌ కె. కిషోర్‌రెడ్డి, వ్యవసాయాధికారి కె.రమణ అన్నారు. మండలంలోని హనుమంతునిపాడు రైతు సేవా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కౌలు కార్డులు ఉంటేనే పంటపై పూర్తిగా హక్కు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ కత్తిరాజారావు, వీఏఓ గోపిక్రిష్ణా, ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, ఏఓ గోపిక్రిష్ణా పాల్గొన్నారు.

వెలిగండ్ల: కౌలు రైతులు భూయజమానులను ఒప్పించి ఒప్పంద పత్రం ద్వారా ధ్రువీకరణ కార్డులను పొందవచ్చని ఏడీఏ ఈ వెంకటరమణ అన్నారు. మండలంలోని గుడిపాటిపల్లి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా కౌలు రైతుల గుర్తింపు కార్డుల ప్రాధాన్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆధార్‌ కార్డులు సమర్పించి రెవిన్యూ అధికారి ద్వారా కౌలు కార్డులు పొందవచ్చన్నారు. వ్యవసాయాధికారి ఎన్‌ రంగకృష్ణ, వీఆర్‌ఓ వి.దయాకర్‌, వీఏఏ డి.జిలానీ, ఏహెచ్‌ఏ వి. ఆంజనేయులు పాల్గొన్నారు.

పీసీపల్లి: కౌలు రైతులకు కార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఏఈఓ పుల్లయ్య అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో పంట సాగు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. వీఏఏ మనోహర్‌, వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ)/పొన్నలూరు: స్థానిక కొండపి-1, కొండపి-2 సచివాలయాల్లో కౌలు రైతులకు మంగళవారం పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ కిరణ్‌ కుమార్‌, వ్యవసాయాధికారి విజయ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. కౌలు గుర్తింపు కార్డు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. కౌలుకు భూమి తీసుకునే రైతులు వీఆర్‌ఓ, వీఏఏలపే సంప్రదించి గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు సుశీల, రామకృష్ణ, వీఏఏ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- పొన్నలూరు మండలంలోని శింగరబొట్లపాలెం గ్రామంలో మంగళవారం కౌలు రైతులకు పలు అంశాలపై తహసీల్దార్‌ ఎంవీకే సుధాకర్‌రావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణచంద్రరావు, సర్పంచ్‌ పెరికా రమేష్‌, ఆర్‌ఐ రాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు సిఫార్సు



డిప్యూటీ డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మైలుచర్ల గ్రామస్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మారుమూల, అటవీప్రాంతంలోఉన్న మైలుచర్ల గ్రామానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు సిఫార్సు చేయనున్నట్లు డిప్యూటీ డీఈఓ ఏ చంద్రమౌళీశ్వర్‌ తెలిపారు. మండలంలోని మైలుచర్ల గ్రామాన్ని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్‌, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిలతో కలిసి మంగళవారం సందర్శించి గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో పిల్లలు విద్యకు దూరమయ్యారని, పాఠశాలకు వెళ్లాలంటే అడవిలో 6 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. మానవహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ షేక్‌.గౌస్‌, మైలుచర్ల గ్రామానికి చెందిన దొర తిరుపతయ్య, పలువురు చిన్న పిల్లల తల్లిదండ్రులు తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటుచేసి తమ పిల్లలు చదువుకునే అవకాశం కల్పించాలని వినతిపత్రాన్ని డిప్యూటీ డీఈఓకు అందజేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న స్కూల్‌కాంప్లెక్స్‌ సమావేశాలను పరిశీలించి సూచనలు చేశారు. చెన్నపునాయునిపల్లి హెచ్‌యం చాంద్‌బాషా, కిరణ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సుభాషిణి

కొండపి(సింగరాయకొండ): మండలంలోని మంగళవారం నేతివారిపాలెం గ్రామంలో పకృతి వ్యవసాయంపై రైతులకు రాష్ట ఎస్‌ఎఫ్‌ఏ సభ్యులు లక్ష్మీనారాయణ, రమేష్‌, ఏపీసీఎన్‌ఎఫ్‌ ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ వి.సుభాషిణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలకు కషాయాలను ఏ దశలో వాడాలో రైతులకు వివరించారు. పంటలకు పురుగు మందుల వాడకంతో కలిగే నష్టాలను వివరించి రైతులకు దశపర్ని కషాయం, అజ్ఞాశాస్త్రం కషాయాలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏడీ జాన్సీ, మస్తాన్‌, విజయలక్ష్మి, మాల కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు సబ్సిడీ



సింగరాయకొండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ

జరుగుమల్లి(సింగరాయకొండ): ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్లతోటలు సాగు చేసుకునే రైతులకు నూరు శాతం సబ్సిడీ అందజేస్తున్నట్లు డ్వామా పీడీ బి.అర్జునరావు తెలిపారు. జరుగుమల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పండ్ల తోటల సాగు-ప్రభుత్వ సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ.. సన్న, చిన్న కారు రైతులు 5 ఎకరాల లోపు మూడు సంవత్సరాల కాలవ్యవధిలో పండ్ల తోటలు సాగు చేసుకుంటే ఖర్చు మొత్తాన్ని ఉపాధి హామీ పథకం, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. పొలంలో బోరు ఉన్న రైతులకు మైక్రో ఇరిగేషన్‌ శాఖ ఆధ్వర్యంలో డ్రిప్‌ సిస్టంపై సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ జలజాక్షి, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఏపీడీ నాగరాజు, ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష, ఏఓ యుగంధర్‌, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్‌ సెంటర్ల పరిశీలన



సీతారాంపురంలో ఆధార్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని సీతారాంపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్‌ కేంద్రాని ఎంపీడీఓ కె.లలిత మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆధార్‌ కేంద్రాలో జరగుతున్న ఆధార్‌ నిర్వహణను పరిశీలించారు. అన్ని వివరాలతో తప్పిదాలు లేకుండా ఆధార్‌ నమోదు చేయాలన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి షేక్‌ షరీఫ్‌, కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులాన్ని పరిశీలించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య

లింగసముద్రం: మండలంలోని పెదపవని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకులాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ పెంచలయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మెడిటేషన్‌, హ్యాండ్‌వాష్‌, పౌష్టికాహారం వంటి ఏడు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను ఆయన గురుకులం సిబ్బందికి సూచించారు. డాక్టర్‌ దివ్య, డాక్టర్‌ అనూరాధ, ప్రిన్సిపాల్‌ స్నేహలత, ఎంఎల్‌హెచ్‌పీ ఖాదర్‌, పరిమళ, ఎంఎంఎస్‌ కృష్ణవేణి, అంకమ్మ, యశోద, జోగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న లింగేశ్వరరెడ్డి

టంగుటూరు: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంచాలని పాఠశాల విద్య గుంటూరు ప్రాంతీయ సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలను మంగళవారం గుంటూరు ప్రాంతీయ సంచాలకులు లింగేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వారానికోసారి పరీక్షలు నిర్వహించి సామర్థ్యాన్ని పెంచాలని హెచ్‌ఎం సుభాషిణికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెంచుపున్నయ్య, తన్నీరు బాలాజీ పాల్గొన్నారు.

సింగరాయకొండ ఎస్సీ కాలనీలో చోరీ

సింగరాయకొండ: పాతసింగరాయకొండ పంచాయతీ ఎస్సీ కాలనీలోని ఓ నివాసంలో మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డు కోటి రత్నమ్మ తన కుమారుడు, వివాహిత అయిన కుమార్తెతో కలిసి నివసిస్తోంది. ఉదయం ఓ దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేసి రూ.30 వేల నగదు, 10 గ్రాముల బంగారం చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరామ్‌ తెలిపారు. కాగా, ఈ చోరీపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వల్లూరు హైస్కూల్లో కెరియర్‌ ఎడ్యుకేషన్‌



వల్లూరులో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అభియాన్‌ ఏఎంఓ రమేష్‌

టంగుటూరు: ఆంధ్రప్రదేశ్‌ సమగ్ర శిక్ష అభియాన్‌-ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వల్లూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల కెరియర్‌ ఎడ్యుకేషన్‌కు ఎంపికైందని హెచ్‌ఎం మందాడి రమణయ్య తెలిపారు. మంగళవారం నిర్వహించిన 8, 9, 10వ తరగతి విద్యార్థుల స్వీయ అభ్యసన కార్యక్రమం ప్రారంభ సదస్సులో ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష అభియాన్‌ ఏఎంఓ రమేష్‌ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు స్వీయ అవగాహన, జీవన నైపుణ్యాలు కలగడంతో పాటు కెరియర్‌ ఎంపికకు అవసరమైన జ్ఞానం అందుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణే లక్ష్యం



కొత్త శింగరబొట్లపాలెంలో కుష్టుపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, రవికిరణ్‌ పేర్కొన్నారు. మండలంలోని కొత్త శింగరబొట్లపాలెం గ్రామంలో మంగళవారం కుష్టు బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. కుష్టు సోకిన వారు భయపడాల్సిన అవసరం లేదని, ఎండీటీ చికిత్సతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

